క్లుప్తంగా

ఘనంగా గుబ్బాలమ్మ శాకంబరి ఉత్సవాలు



నిడదవోలు రూరల్: గోపవరం గ్రామంలోని గుబ్బాలమ్మ వారి శాకంబరి ఉత్సవాలను రెండోరోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుబ్బాలమ్మను పూలు, పండ్లు, వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మేనేజర్ ఎన్.సూర్య ప్రకాశరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధిత రైతులకు ఆర్థిక సాయం



కంసాలిపాలెంలో రైతుకు ఆర్థిక సాయం అందజేస్తున్న కస్తూరి సత్యప్రసాద్

నిడదవోలు రూరల్: మండలంలోని ఎర్ర కాలువ వరద ముంపుతో పూర్తిగా నష్టపోయిన రైతులకు మంగళవారం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన కస్తూరి సత్యప్రసాద్ (నాని) ఆర్థిక సహాయం అందజేశారు. కంసాలిపాలెం, సింగవరం, తాళ్లపాలెం గ్రామాలు చెందిన 20 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఈ ఆర్థిక సాయం అందజేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సరిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల అక్రమ రవాణాను అడ్డుకోవాలి

నిడదవోలు రూరల్: బాలికల అక్రమ రవాణాను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ పి.నళిని కోరారు. మండలంలోని కోరుమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, అక్రమ రవాణా, బాలల హక్కులు, కిషోర బాలికలు తీసుకోవాల్సిన వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ కుమారి, హెచ్ఎం వి.లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు: స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వ్యాయామ అధ్యాపక పోస్టును తాత్కాలిక ప్రాతిపదికపై భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర మంగళవారం తెలిపారు. ఎంపీఈడీ కోర్సులో 55 శాతం మార్కులతో పీజీ పాసై, నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత గల మహిళా అభ్యర్థులకు ఈ పోస్టు భర్తీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. పురుష అభ్యర్థులైతే 50 ఏళ్లు నిండిన వారై ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాను వచ్చే నెల మూడో తేదీలోగా కళాశాలలో అందజేయాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

సీడీపీఓ సుందరి సేవలు అభినందనీయం



గోపాలపురం సీడీపీఓ వైటీటీ సుందరిని సత్కరిస్తున్న పీడీ విజయకుమారి, సిబ్బంది

గోపాలపురం: సీడీపీఓ వైటీటీ సుందరి సేవలు అభినందనీయమని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి కె.విజయకుమారి కొనియాడారు. గోపాలపురం సీడీపీఓ వైటీటీ సుందరి ఉద్యోగ విరమణ సన్మానం మంగళవారం స్థానిక కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ విజయకుమారి మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లతో ఎటువంటి విభేదాలు లేకుండా పని చేయించిన ఘనత సుందరికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

రేషన్ డిపోల్లో గోధుమ పిండి పంపిణీ

నల్లజర్ల: నిత్యావసర సరకులను ప్రజలకు ప్రతి నెలా సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ పి.కృష్ణారావు రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆయన డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశమై పలు విషయాలు వివరించారు. ఆగస్టు నెలలో బియ్యంతో పాటు గోధుమ పిండి కూడా అందిస్తామన్నారు. డీలర్లు కంది పప్పు, పంచదారకు డీడీ కట్టి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రోజూ ఉదయం ఆరు గంటల నుంచే రేషన్ పంపిణీ జరగాలన్నారు. సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణ, డీలర్ల సంఘ అధ్యక్షుడు సీమకుర్తి నరసింహమూర్తి పాల్గొన్నారు.

సొంత 'గూటి'కి చేరేదెలా?

సాధారణంగా ప్రతిఒక్కరూ సొంతింటి కోసం కలలుగంటుంటారు. ఆర్థిక స్తోమత ఉన్న వారు తమ హోదాకు తగ్గట్టుగా ఇంటిని సమకూర్చుకుంటారు. మధ్య తరగతి వారు అప్పో సప్పో చేసి తాహతుకు తగ్గ ఇంటితో సంతృప్తి పడతారు. పేదవారికి మాత్రం సొంతిల్లు అనేది గొప్ప కలే. వారి స్వప్నాన్ని నిజం చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేసింది. పేదలకు సొంత స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి అన్ని విధాలా సహకరించింది. తమ స్వప్నం సాకారమవుతుందని అనుకుంటున్న తరుణంలో.. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఆ పేదల కలను కల్లలుగా చేసేందుకు అడుగడుగునా అవరోధాలు కల్పిస్తోంది.

- పేదింటిపై ప్రభుత్వం శీతకన్ను!
- గృహ నిర్మాణాలకు బ్రేక్
- స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- ఐదు నెలలుగా నిలిచిన బిల్లుల చెల్లింపులు
- వెబ్‌సైట్‌లో మార్పుల నెపంతో జాప్యం



ద్వారకా తిరుమల మండలం పంగిడిగూడెంలో జగనన్న లేఅవుట్ ఇళ్ల నిర్మాణాలు

లాక్ చేసిన ప్రభుత్వం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వినియోగించిన గృహ నిర్మాణ శాఖ వెబ్‌సైట్ లాగిన్‌ను ప్రస్తుత ప్రభుత్వం లాక్ చేసింది. దీంతో వేర్వేరు దశలలో పూర్తయిన గృహాలకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు వీలు లేని పరిస్థితి ఏర్పడిందంటున్నారు. ఈ కారణంగా మెజార్టీ కాలనీలలో గృహ నిర్మాణాలకు బ్రేక్ పడినట్టు చెబుతున్నారు. అయితే ఈ గృహ నిర్మాణాలపై త్వరలోనే ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

నల్లజర్ల: గోపాలపురం నియోజకవర్గంలో చురుగ్గా సాగుతున్న గృహ నిర్మాణాలపై రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. వేర్వేరు దశలలో జరుగుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఈ నేపథ్యంలో గత 25 రోజుల క్రితం వరకు బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు కూడా సర్వర్‌ను లాక్ చేసినట్టు సమాచారం. బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు, విడుదల చేసేందుకు ఇప్పటి వరకు ఉపయోగించిన వెబ్‌సైట్ మారుస్తున్నట్టు చెప్పడంతో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది.

మంజూరైనవి 7,634

గోపాలపురం నియోజకవర్గంలో వైఎస్సార్ జగనన్న కాలనీలలో మొత్తం 7,634 గృహాలు మంజూరయ్యాయి. వాటిలో నిర్మాణాలు ప్రారంభించినవి 475 ఉన్నాయి. అసలు 4,092 ప్రారంభం కాలేదు. బేస్‌మెంట్ లెవల్‌లో 701, రూఫ్ లెవల్‌లో 394 ఉన్నాయి. దాదాపు 445 తుది దశకు రాగా, నూరు శాతం 1,417 పూర్తయ్యాయి. వీటిలో లబ్ధిదారుల కుటుంబాలు నివాసం కూడా ఉంటున్నాయి. మిగిలిన గృహాలు వేర్వేరు నిర్మాణ దశల్లో ఉన్నాయి. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గృహ నిర్మాణాలకు అంతరాయం ఏర్పడినట్టు తెలుస్తోంది. వెబ్‌సైట్‌లో మార్పులు చేయాలంటూ, బిల్లులు నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో గృహ లబ్ధిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జూలై 10వ తేదీ నుంచి వెబ్‌సైట్ పనిచేస్తుందని చెబుతున్నా, సాంకేతిక కారణాల వల్ల రోజుకు ఒక గంట మాత్రమే వినియోగంలో ఉంటున్నట్టు చెబుతున్నారు.

శ్లాబ్ వేసినా బిల్లు రాలేదు



జనవరిలో అప్పు చేసి శ్లాబ్ వేశాను. ఇంత వరకూ బిల్లు రాలేదు. తెచ్చిన అప్పునకు వడ్డీ పెరిగిపోతోంది. ఫైనల్ బిల్లు వస్తే కొంత వరకూ బాకీ తీరిపోతుంది. వాటి కోసం ఎదురు చూస్తున్నాను.

–ఉప్పాడ కనకలక్ష్మి, గృహ లబ్ధిదారు, అనంతపల్లి

సర్వర్ చెక్ చేస్తున్నారు



బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కల్పించారు. ఇప్పటివరకూ కొనసాగిన సర్వర్‌ను చెక్ చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత బిల్లులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పూర్తయిన ఇళ్లకు దశల వారీగా బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నాం.

– శేఖర్‌బాబు, డీఈఈ, గృహ నిర్మాణ శాఖ, గోపాలపురం

అనుమతి లేకుండా వాటర్ ట్యాంక్ కూల్చివేత



కలవచర్లలో కూల్చివేసిన వాటర్ ట్యాంక్

నిడదవోలు రూరల్: మండలంలోని కలవచర్ల రామాలయం సమీపంలోని పాత వాటర్ ట్యాంక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే కూల్చి వేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ గ్రామస్తులకు రక్షిత మంచినీరు అందించేందుకు సుమారు 40 ఏళ్ల క్రితం 10 వేల లీటర్ల సామర్థ్యం గల ఈ వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఇటీవల గ్రామంలో మరో ట్యాంక్ నిర్మించడంతో కొంతకాలంగా దీనిని వినియోగించడం లేదు. అయితే నిరుపయోగంగా ఉన్న ఈ ట్యాంకు కూల్చివేతకు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల అనుమతులు ఉండాలి. అయితే అలాంటి నిబంధనలను పాటించకుండానే పంచాయతీ అధికారులు ఈ ట్యాంక్‌ను కూల్చేశారు. వాటర్ ట్యాంక్‌లోని ఇనుమును సైతం అక్రమంగా విక్రయించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ కూల్చివేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలవచర్ల గ్రామస్తులు కోరుతున్నారు. వాటర్ ట్యాంక్ కూల్చివేసేందుకు ఎటువంటి అనుమతులు లేవని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

కొవ్వాడ కాలువపై సమగ్ర సర్వే చేయండి

- కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ
- రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశం



గోపాలపురంలో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గోపాలపురం: మండలంలోని గ్రామాల వారీగా కొవ్వాడ కాలువ జలాల వినియోగం, ఈ కాలువ స్థితిగతులపై సమగ్ర సర్వే జరపాలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులకు కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేటలోని జలాశయం నుంచి కొవ్వాడ కాలువ గోపాలపురం మండలం మీదుగా ప్రవహిస్తోంది. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొవ్వాడ జలాశయం నుంచి విడుదలైన వరద వల్ల వేలాది ఎకరాల వరి పంట నీట మునిగిందన్నారు. ఏటా రైతులకు నష్ట పరిహారం చెల్లించే పరిస్థితి రాకుండా కాలువ పూడిక తీత, కల్వర్టుల నిర్మాణం ద్వారా శాశ్వత పరిష్కారం చూడాలని సూచించారు. పది రోజులైనా మండలంలోని వెంకటాయపాలెం, చిట్యాల, చెరుకుమిల్లి గ్రామాల్లోని పంట పొలాల్లో ముంపు నీరు తగ్గకపోవడానికి గల కారణాలను సబ్ కలెక్టర్ కొవ్వాడ రిజర్వాయర్ ఇరిగేషన్ ఏఈ పి.సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థానిక తహసీల్దార్ బి.ప్రదీప్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కె. కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే ముప్పిడి



కొవ్వూరు బీసీ వసతి గృహంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: పట్టణంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని వసతులను స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. బీసీ సంక్షేమ వసతిగృహం పైకప్పు పెచ్చులుగా ఊడి కింద పడుతున్న విషయాన్ని గుర్తించిన ఆయన ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. హాస్టల్‌కు సరఫరా చేస్తున్న బియ్యం, ఇతర సరకుల నాణ్యతను పరిశీలించారు. వార్డెన్‌లను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, మునిసిపల్ మాజీ చైర్మన్ కొల్లి రమేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ పెనుమాక జయరాజు, టీవీ రామారావు, డేగల రాము, బీవీ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

గోదారి ఒడ్డునే వ్యర్థాల డంపింగ్

మున్సిపల్ ట్రాక్టర్లను అడ్డుకున్న గోవు, గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు



కొవ్వూరు క్రిస్టియన్ శ్మశానవాటికలో వ్యర్థాలను డంపింగ్ చేస్తున్న మున్సిపల్ ట్రాక్టర్

కొవ్వూరు: గోదావరి నది పవిత్రతను దెబ్బతీసేలా నది ఒడ్డునే మునిసిపాలిటీ వ్యర్థాలను డంపింగ్ చేయడం బాధాకరమని గోవు, గోదావరి పరిరక్షణ సమితి సభ్యుడు వైకే శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలో సేకరించిన వ్యర్థాలను తీసుకొచ్చి క్రిస్టియన్ శ్మశాన వాటికలో పారబోస్తున్నారు. ఈ చర్యలను పరిరక్షణ సమితి సభ్యులు మంగళవారం అడ్డుకున్నారు. అప్పటికే ఒక ట్రాక్టర్ వ్యర్థాలను అక్కడ డంప్ చేశారు. వారి ప్రతిఘటనతో మిగిలిన రెండు ట్రాక్టర్లు డంపింగ్ చేయకుండా వెనుతిరిగాయి. నదికి వరద ప్రవాహం పెరిగితే ఈ వ్యర్థాలు తిరిగి నదిలో కలుస్తాయి. తమ మనోభావాలు దెబ్బతీసేలా శ్మశానవాటికలో చెత్త డంపింగ్ చేయడంపై క్రైస్తవులు మండి పడుతున్నారు. మరో వైపు హిందువులు పవిత్రంగా భావించే గోష్పాద క్షేత్రాన్ని ఆనుకుని పిండ ప్రదానాల రేవు సమీపంలోనే చెత్తను డంపింగ్ చేయడంపై స్థానిక ఆధ్యాత్మికవేత్తలు మండిపడుతున్నారు. మరో మూడేళ్లలో గోదావరి నదికి మహా పుష్కరాలు రానున్నాయి. ఇటువంటి తరుణంలో పురపాలక సంఘం శాశ్వత డంపింగ్ యార్డును సమకూర్చుకోలేక పోవడం బాధాకరం అని గోవు, గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు పేర్కొంటున్నారు.

వంతెన మరమ్మతులకు మంత్రి దుర్గేష్ ఆదేశం



కాపవరంలో పర్యటిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పెరవలి: ప్రజా ప్రయోజనార్థం ఎలాంటి పనులు చేయటానికి సిద్ధంగా ఉన్నామని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని కాపవరం గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానిక సమస్యల గురించి గ్రామస్తులను, నాయకులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన గ్రామంలోని వంతెనకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు, రైతులు మంత్రి దుర్గేష్‌ను కోరారు. దీంతో వంతెన మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని వెంటనే మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో పలు ప్రాంతాలను తిరిగి, గుర్తించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నందిప చక్రవర్తి, శేషు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పెనాల్టీ లేకుండా పొగాకు కొనుగోళ్లపై హర్షం

గోపాలపురం: అపరాధ రుసుం లేకుండా పొగాకు కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద మంగళవారం అపరాధ రుసుం లేకుండా పొగాకు కొనుగోళ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్, రాజమహేంద్రవరం, ఏలూరు ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, పుట్టా మహేష్‌కుమార్, పొగాకుబోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబులకు రైతు సంఘం నాయకులు గద్దే శేషగిరిరావు, గోపాలపురం పొగాకు వేలం కేంద్రం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, మాజీ అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్, కూసం రామమోహన్‌రెడ్డి, జొన్నలగడ్డ ప్రసాద్, దుగ్గిరాల రాంబాబు తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

క్షేత్రం.. అపరిశుభ్రం



వరద నుంచి తేరుకున్న కొవ్వూరు గోష్పాద క్షేత్రం రోడ్లపై పేరుకు పోయిన బురద

- వరద ముంపు నుంచి తేరుకున్న గోష్పాద క్షేత్రం
- పేరుకుపోయిన బురద, ఒండ్రు మట్టి
- దేవతా వృక్షం నరికివేసి కలప, కొమ్మలు అక్కడే వదిలేసిన వైనం
- దేవాలయాల సముదాయంలో పారిశుధ్యం అధ్వానం

కొవ్వూరు: గోదావరి వరద ముంపు నుంచి గోష్పాద క్షేత్రం తేరుకుంది. మూడు రోజులుగా ముంపులో ఉన్న ఈ ప్రాంతంలో వరద తగ్గింది. దాంతో ఎక్కడికక్కడ, రోడ్లపై ఒండ్రు మట్టి, బురద పేరుకు పోయాయి. ఇప్పటికీ గోష్పాద క్షేత్రం స్నానఘట్టాలు పూర్తిగా ముంపులోనే ఉన్నాయి. స్నానఘట్టాల వద్ద ఒడ్డును తాకుతూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. క్షేత్రంలోని సుందరసాయి ఆలయం ప్రాంగణంలో ఇంకా రెండు అడుగుల మేర నీరు నిలిచి ఉంది. హిందువులు ఎంతో పవిత్రంగా దేవతా వృక్షంగా భావించే ఇక్కడి రావిచెట్టును ఇటీవల నరికివేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం వివాదాస్పదం కావడంతో వృక్షాన్ని నరికిన వారు దుంగలు, చెట్ల కొమ్మలు, ఆకులు అక్కడే విడిచి పెట్టారు. దీంతో గోష్పాదక్షేత్రంలో అపరిశుభ్రత నెలకొంది. నిత్యం ఈ క్షేత్రానికి వచ్చే భక్తులు ఈ దేవతా వృక్షం వద్దే పూజలు చేస్తుంటారు. ఈ వృక్షం నీడలోనే అనేక దేవతా ప్రతిమలు ఉన్నాయి. ఈనెల 27న నిర్వహించిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో గోష్పాద క్షేత్రంలో దేవతా వృక్షం నరికి వేతపై మున్సిపల్ కమిషనర్‌ను సభ్యులు నిలదీసినప్పటికీ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. దీంతో క్షేత్రంలోనే దుంగలు, చెట్టు కొమ్మలు ఇలానే విడిచిపెట్టారు. కనీసం క్షేత్రం పవిత్రను దృష్టిలో ఉంచుకుని నరికిన వ్యక్తుల చేత కలపను ఒకచోట పెట్టించకపోవడంతో అపరిశుభ్రంగా తయారైంది. ఈ చెట్ల కొమ్మల వద్ద ఒండ్రు మట్టి పేరుకుని మరింత అధ్వానంగా తయారైంది. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రాన్ని వెంటనే శుభ్రం చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ క్షేత్రంలో పారిశుద్య నిర్వహణ బాధ్యత మునిసిపాలిటీ ద్వారానే జరుగుతోంది. అయినప్పటికీ వారం పది రోజుల నుంచి చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో పారిశుధ్యాన్ని మునిసిపాలిటీ విస్మరించిందనే చెప్పవచ్చు.



గోష్పాద క్షేత్రంలోని సుందరసాయి ఆలయం ప్రాంగణంలో నిలిచి ఉన్న గోదావరి వరద



గోష్పాద క్షేత్రంలో దేవతా వృక్షాన్ని నరికి విడిచిపెట్టిన కొమ్మలు, చెత్త

ఆర్పీల నూతన అధ్యక్షురాలిగా 'అడ్డాల'



నూతన కమిటీ సభ్యులు

నిడదవోలు: స్థానిక పుర పాలక సంఘ పరిధిలోని మెప్మాలో పని చేస్తున్న రీసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)ల నూతన కమిటీ (సీఐటీయూ)ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అడ్డాల మరియకుమారి, గౌరవాధ్యక్షుడిగా జువ్వల రాంబాబు, ఉపాధ్యక్షురాలిగా గనిరెడ్డి సుభద్ర, కార్యదర్శిగా సాధనాల సీతాదేవి, కోశాధికారిగా పట్నాల లక్ష్మి, సహాయ కార్యదర్శిగా గౌతు సాయి సూర్యకుమారి, సభ్యులుగా మత్తి లావణ్య, కొత్తూరు నాగమణి, బత్తుల సావిత్రీదేవి, కొర్లేపర సత్యనాగిరెడ్డి, వెంకటలక్ష్మి, ముప్పిడి సాలోవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా 'గద్దే'



గద్దే శ్రీనివాసరావు

దేవరపల్లి: యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఆ గ్రామానికి చెందిన గద్దే శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ప్రిన్సిపాల్ పి.ఛత్రపతి శివాజీ అధ్యక్షతన మంగళవారం ఆ కళాశాలలో నిర్వహించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశంలో నూతన అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా పి.ఛత్రపతి శివాజీ, మహిళా ప్రతినిధిగా పుట్టా వీరమణి, గౌరవ ప్రతినిధిగా దుగ్గిరాల వీరసత్యం, సభ్యులుగా తలారి నాగేశ్వరరావు, దాసరి సుధాకరన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి సహకారంతో కళాశాలకు శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

పెరవలిలో భారీ అన్న సమారాధన

పెరవలి: గురు పౌర్ణమిని పురస్కరించుకుని పెరవలి సాయిబాబా ఆలయం వద్ద మంగళవారం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. షిర్డీ సాయి బాబాకు తెల్లవారుజామున పంచామృతాలతో పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి అన్న సమారాధన ప్రారంభించారు. వివాహ భోజనాన్ని తలపించేలా రకరకాల పిండి వంటలు, కూరగాయలతో మొత్తం 13 రకాల వంటకాలతో అన్న సమారాధన చేశారు. పెరవలి, నల్లాకులవారిపాలెం, ముక్కామల, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, అజ్జరం, కాకరపర్రు గ్రామాల నుంచి సుమారు 8 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహనా ర్యాలీ

కొవ్వూరు: హెల్మెట్ వాడకం అవసరాన్ని వివరిస్తూ మంగళవారం స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర లీగల్ సెల్ ఆథారిటీ, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ జాతీయ సేవా పథకం, ఉన్నత భారత్ అభియాన్ ఆదేశాల మేరకు ఈ ర్యాలీ నిర్వహించామని ప్రిన్సిపాల్ ఎస్వీ సుబ్బారావు తెలిపారు. ప్రతి విద్యార్థి విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.సత్యనారాయణ, పిల్లి మురళీధర్, ఉన్నత భారత్ అభియాన్ కో-ఆర్డినేటర్లు వై.రమేష్, ఎన్ శివన్నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం



విశేష అలంకరణలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఉండ్రాజవరం: ఆషాఢ మాసం కృత్తిక నక్షత్రం సందర్భంగా మంగళవారం ఉండ్రాజవరంలోని శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు నిర్వహించి, స్వామివారి అభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.